



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

సోమవారం, నవంబర్ 18, 2024

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## 67.72 లక్షల ఇళ్లలో సర్వే పూర్తి



**58.3 శాతం పూర్తయిన ఇంటింటి కుటుంబ సర్వే**

**87.1 శాతంతో మొదటి స్థానంలో ములుగు జిల్లా**

**38.3%తో చిట్ట చివరన గ్రేటర్ హైదరాబాద్**

**హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఇప్పటివరకు 58.3 శాతం పూర్తయింది. ఈ నెల 6వ తేదీన సర్వే ప్రారంభం కాగా... తొలి మూడు రోజులు ఇళ్ల గుర్తింపు, స్టికర్లు అంటించే కార్యక్రమం నిర్వహించారు. 9వ తేదీ నుంచి కుటుంబాల వివరాలు సేకరించి నమోదుచేసే ప్రక్రియ ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,16,14,349 ఇళ్లను గుర్తించగా, ఆదివారం సాయంత్రానికి 67,72,246 ఇళ్లలో సర్వే ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సర్వేలో 87,807 మంది ఎన్యుమరేటర్లు, 8,788 మంది పర్యవేక్షకులు పాల్గొంటున్నారు.**

**సర్వేలో కీలకాంశాలు..**

- సర్వేలో భాగంగా గుర్తించిన మొత్తం ఇళ్లు: 1,16,14,349. ఇందులో గ్రామీణ ప్రాంతంలో 64,41,183, పట్టణ ప్రాంతంలో 51,73,166 ఇళ్లు ఉన్నాయి.
- రాష్ట్రాన్ని 92,901 బ్లాకులుగా విభజించారు. ఇందులో గ్రామీణ ప్రాంతంలో 52,493, పట్టణ ప్రాంతంలో 40,408 బ్లాకులున్నాయి.
- సర్వేలో 87,807 మంది ఎన్యుమరేటర్లు పాల్గొంటున్నారు. గ్రామీణ ప్రాంతంలో 47,561 మంది, పట్టణ ప్రాంతంలో 40,246 మంది ప్రజల వివరాలు సేకరిస్తున్నారు.
- సర్వే తీరును సమన్వయం చేసేందుకు 8,788 మంది పర్యవేక్షకులను ప్రభుత్వం నియమించింది. ఇందులో 4,947 మంది గ్రామాల్లో, 3,841 మంది పట్టణ ప్రాంతంలో ఉన్నారు.
- ఆదివారం నాటికి ములుగు జిల్లాలో అత్యధికంగా 87.1 శాతం సర్వే పూర్తయింది. ఆ తర్వాత స్థానంలో నల్లగొండ జిల్లా 81.4 శాతం, జనగామ 77.6 శాతం, మంచిర్యాల 74.8 శాతం, పెద్దపల్లి జిల్లాలో 74.3 శాతం సర్వే పూర్తయింది. అత్యధిక జనసాంద్రత ఉన్న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రం ఇప్పటివరకు 38.3 శాతం మాత్రమే పూర్తయినట్లు అధికార వర్గాలు తెలిపాయి.



## రేవంత్.. ప్రజల్ని ఒప్పించి ప్రక్షాళన చెయ్

**అలాగైతే మూసీ ప్రాజెక్టుకు మేం శ్రమదానం చేస్తాం.. పేదల ఇళ్లను కూల్చివేయడమే ఇందిరమ్మ రాజ్యమా?**

**తీవ్ర మనోవేదనతో ఇప్పటికే 9 మంది మృతిచెందారు.. బుల్డోజర్లు వచ్చినా ప్రజల వెంటే ఉంటాం: కిషన్‌రెడ్డి**

**వారి కుటుంబాల మధ్య వ్యాపార సంబంధాలు రుజువు చేయలేకపోతే పదవి నుంచి తప్పుకొంటా: బండి**

## సంగారెడ్డి కలెక్టర్ సంతకం ఫోర్జరీ

**40 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిపై కన్ను**

**అమ్మేందుకు ఎన్‌వోసీ కూడా తయారీ**

**స్వాతంత్ర్య సమరయోధుల వారసుల కుట్ర**

**ఐదుగురి అరెస్టు, పరారీలో నలుగురు**




రామచంద్రాపురం, నవంబరు 17, : స్వాతంత్ర్య సమరయోధుల వారసులు కొందరు అక్రమానికి పాల్పడ్డారు. తమది కాని ఆ భూమిని విక్రయించి సొమ్ము చేసుకునేందుకు అడ్డదారి తొక్కారు. ఏకంగా కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నిరంభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) సృష్టించి దొరికిపోయి కటకటాలపాలయ్యారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం కొల్లూరులోని సర్వే నం191లోని భూమిని ఒక్కొక్కరికి రెండెకరాల చొప్పున 74 మంది స్వాతంత్ర్య సమరయోధులకు 1984లో ప్రభుత్వం కేటాయించింది. ఇందులో అల్లాదుర్గం, టేక్మాల్‌కు చెందిన ఐదుగురు స్వాతంత్ర్య సమరయోధులున్నారు. అయితే, వీళ్ల వారసులు వీరేశం, రాములు, సుధాకర్, సంతోష్, నాగరాజు బృందంగా ఏర్పడి సర్వే నం.191లోని ఓ రెండు ఎకరాలను విక్రయానికి పెట్టారు. రూ.40 కోట్లు పలికే ఆ భూమిని కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చిన ఓ వ్యక్తి రూ.2.5 లక్షలు వారికి బయానాగా ఇచ్చాడు. అయితే, సదరు భూమి క్రయవిక్రయాలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ఎన్‌వోసీ తనకు కావాలని షరతు పెట్టాడు. దీంతో కలెక్టర్ కార్యాలయం దగ్గర దళారీగా పని చేసే శ్రీనివాసచారి అనే వ్యక్తిని వారసుల బృందం కలిసింది. శ్రీనివాసచారి మరికొందరితో కలిసి సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఎన్‌వోసీ సృష్టించాడు. ఈ విషయం నెమ్మదిగా బయటపడగా స్థానిక తహసీల్దార్ సంగ్రారెడ్డి ఈ నెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చర్యలు తీసుకున్న పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేసి శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో నలుగురి కోసం గాలిస్తున్నారు. కాగా, నిందితులు విక్రయించడానికి యత్నించింది ప్రభుత్వ భూమి అని తహసీల్దార్ సంగ్రారెడ్డి స్పష్టం చేశారు. సదరు భూమి స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించినప్పటికీ ప్రభుత్వం ఇదివరకే వెనక్కి తీసుకుందని తెలిపారు. తాను ఇటీవలే విధుల్లో చేరానని, భూమిని ఎందుకు వెనక్కి తీసుకున్నారనే అంశం తెలుసుకునేందుకు రికార్డులు పరిశీలించాల్సి ఉందని చెప్పారు.

## మంత్రి దుద్దిళ్లపై ఆరోపణలు..బీజేపీ నేతపై కేసు



కాటారం, నవంబరు 17 : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై సోషల్ మీడియాలో ఆరోపణల నేపథ్యంలో బీజేపీ నేత చల్లా నారాయణరెడ్డిపై ఆదివారం కేసు నమోదైందని భూపాలపల్లి జిల్లా కాటారం ఎస్సై అభినవ్ తెలిపారు. మంత్రిపై నారాయణరెడ్డి యూట్యూబ్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా నిరాధార ఆరోపణలు చేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నాడని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నామని వివరించారు.



## సంపదపై బీజేపీ కన్ను: భట్టి

## అధికార లాంఛనాలతో నారా రామ్మూర్తి అంత్యక్రియలు

**తమ్ముడి పాడె మోసిన చంద్రబాబు.. కన్నీటి పర్యంతమైన ముఖ్యమంత్రి**

**నారావారిపల్లిలో తల్లిదండ్రుల సమాధుల పక్కనే చితి ఏర్పాటు**

**నిప్పంటించిన రోహిత్, గిరీష్**

**మహారాష్ట్ర గవర్నర్ సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖుల హాజరు**



తిరుపతి, నవంబరు 17 : అనారోగ్యంతో కన్నుమూసిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, సీఎం చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడి పార్థివ దేహానికి ఆదివారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా నారావారిపల్లి లో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దంపతులు, నారా, నందమూరి కుటుంబాలకు చెందిన వారు పాల్గొని రామ్మూర్తికి తుది వీడ్కోలు పలికారు. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. శనివారం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో మృతి చెందిన రామ్మూర్తినాయుడి భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం మంత్రి నారా లోకేశ్,

(మిగతా 2వ పేజీలో)



## మోదీ నాయకత్వాన.. ప్రగతిపథంలో భారత్

**5 ట్రిలియన్ల ఆర్థిక శక్తిగా ఎదగాలంటే ఎన్డీయే ప్రభుత్వమే ఉండాలి: పవన్**

**మహాయుతి అభ్యర్థుల తరఫున రెండో రోజూ ప్రచారం**

అమరావతి, నవంబరు 17 : మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం దేశాన్ని ప్రగతి పథాన తీసుకెళ్తోందని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సుస్థిర పాలన, సమగ్ర అభివృద్ధితోనే బలమైన ఆర్థిక వ్యవస్థ సాధ్యమని చెప్పారు. భారత్ ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలంటే కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం, మహారాష్ట్ర మహాయుతి సర్కారు ఉండాలని ఆకాంక్షించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి అభ్యర్థుల తరపున ఆదివారం వరుసగా రెండో రోజూ ఆయన ప్రచారం నిర్వహించారు. చంద్రాపూర్ జిల్లా పరిధిలోని బల్లార్‌పూర్, పుణే కంటోన్మెంట్, చంద్రాపూర్ నియోజకవర్గాల్లో భారీ ర్యాలీ, బహిరంగ సభల్లో ప్రసంగించారు. బల్లార్‌పూర్ మినీ భారతదేశంలాంటిదని, ఇక్కడ అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, రకరకాల భాషలు మాట్లాడే ప్రజలు కలిసికట్టుగా

(మిగతా 2వ పేజీలో)

# రేవంత్.. ప్రజల్ని ఒప్పించి ప్రక్షాళన చెయ్

మూసీ పరీవాహక ప్రాంతాన్ని ప్రక్షాళన చేసే ముందు అక్కడ ఏళ్లుగా నివసిస్తున్న పేదలను ఒప్పించాలని, వారి అనుమతితో మూసీ సుందరీకరణ ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. పేద ప్రజలకు ఇబ్బంది లేకుండా మూసీ ప్రాజెక్టు చేపడితే బీజేపీ శ్రేణులమందరమూ శ్రమదానం చేస్తామన్నారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లోని బస్తీల్లో సీఎం పాదయాత్ర చేయాలని, తాను కూడా పాదయాత్ర చేస్తానని చెప్పారు. బీజేపీ మూసీ నిద్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి అంబర్‌పేట తులసీరాం నగర్‌లో బస చేసిన కిషన్‌రెడ్డి.. ఆదివారం ఉదయం అక్కడే అల్పాహారం చేసి బస్తీవాసులతో ముచ్చటించారు. ఎన్ని బుల్డోజర్లు వచ్చినా పేద ప్రజల ఇళ్లకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. పేద ప్రజలపైన రాష్ట్ర ప్రభుత్వం యుద్ధం ప్రకటించి ఇళ్లను కూల్చుతోందన్నారు. ఇండ్లు కూల్చుతామని సీఎం రేవంత్ ప్రకటించిన తర్వాత.. భయం, ఆవేదన కారణంగా 9 మంది గుండెపోటుతో మరణించారన్నారు. ఇళ్లను కూల్చడమే ఇందిరమ్మ రాజ్యామా అని నిలదీశారు.

# సంపదపై బీజేపీ కన్ను: భట్టి

ప్రజలపై బీజేపీకి ప్రేమ లేదని, ఇక్కడి అపార ఖనిజ సంపదపైన ఆ పార్టీ కన్నేసిందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖనిజ సంపదను అంబానీ, అదానీలకు అప్పగించేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఝార?ండ్ ఎన్నికల పరిశీలకులుగా ఉన్న భట్టి.. ఆదివారం బోకారో నియోజకవర్గంలో ఇండియా కూటమి తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర సంపదను, వనరులను కాపాడే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జనాభా నిష్పత్తి ప్రకారం దేశ సంపద, వనరుల పంపిణీ జరగాలని రాహుల్ చెబుతున్నారని, ఇదే నినాదంతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. ఝార?ండ్‌లోనూ ఇండియా కూటమి గెలిస్తే.. ఇక్కడి సంపద ఈ ప్రాంత వాసులకే పంచుతామన్నారు. తెలంగాణ తరహాలో ఏడు గ్యారెంటీలను అమలు చేస్తుందని తెలిపారు.

# సచివాలయంలో వాస్తుమార్పులు

### గేట్ల తొలిగింపు పనులు పూర్తి.. కొత్త మార్గం నుంచే సీఎం రేవంత్‌రెడ్డి రాకపోకలు



హైదరాబాద్, నవంబర్ 17 : సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సచివాయలంలో వాస్తు మార్పులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే రెండుమూడు విడతలుగా వాస్తు మార్పులు చేసినా పెద్దగా మార్పు కనిపించకపోవడంతో తాజాగా మరోసారి మార్పులు చేస్తున్నారు. ఈసారి ఏకంగా సచివాలయం ఎదురుగా ఉన్న ప్రధాన ద్వారాన్నే తొలిగిస్తున్నారు. దీంతోపాటు రోడ్ల నిర్మాణం, సీఎం, మంత్రులు వచ్చిపోయే 'రూట్'లలో భారీగానే మార్పులు జరుగుతున్నాయి. వాస్తవానికి సచివాలయానికి ఎదురుగా తూర్పువైపు ఉన్న ప్రధాన మహా ద్వారాన్ని ప్రభుత్వం ఆరు నెలల కిందటే మూసివేసింది. వాస్తు మార్పుల్లో భాగంగా ఈ ఏడాది జూన్ నుంచే గేటుకు తాళం వేశారు. ఆ మార్గం నుంచి ఎలాంటి రాకపోకలు జరగడం లేదు. పొరబాటున కూడా గేటు తెరువకుండా ఏకంగా ఇనుప తీగలు చుట్టేశారు. ఆదివారం మహాద్వారం గేట్లను తొలిగించారు. ద్వారాన్ని కూడా తొలిగించనున్నారు. చుట్టూ ఉన్నట్టుగానే రెయిలింగ్ ఏర్పాటు చేస్తారు. ప్రధాన ద్వారాన్ని ఈశాన్యంవైపు జరిపి ఉత్తరం ద్వారానికి సమీపంలో నిర్మిస్తారు. ఈ మేరకు ఇప్పటికే అక్కడ రెయిలింగ్‌ను తొలిగించారు.

# అధికార లాంఛనాలతో నారా రామ్మూర్తి అంత్యక్రియలు

రామ్మూర్తి నాయుడు తనయులు నారా రోహిత్, నారా గిరీష్ విమానంలో తిరుపతికి తీసుకువచ్చారు. తర్వాత సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ మరో విమానంలో వచ్చారు. వీరితోపాటు చంద్రబాబు సోదరి హైమావతి తదితరులు రామ్మూర్తి నాయుడి పార్థివదేహంపై పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళు లర్పించారు.

### తల్లిదండ్రుల సమాధుల వద్దే

స్వగ్రామం నారావారి పల్లిలోని ఇంటి నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు అంతిమయాత్ర మొదలు కాగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు పాడె మోశారు. చంద్రబాబు తల్లిదండ్రుల సమాధుల సమీపంలోనే అధికార లాంఛనాల నడుమ అంత్యక్రియలు జరిగాయి. గౌరవసూచకంగా తొమ్మిది మంది ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. 3.50 గంటలకు నారా రోహిత్, నారా గిరీష్ తండ్రి చితికి నిప్పంటించారు. కాగా, అంత్యక్రియలకు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరై రామ్మూర్తినాయుడికి నివాళులు అర్పించారు. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, హీరోలు నాగశౌర్య, రాజేంద్రప్రసాద్, మోహన్‌బాబు, మంచు మనోజ్, నిర్మాత ఎన్‌వీ ప్రసాద్, మాజీ మంత్రులు అమరనా?థ్‌రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కొత్తపల్లి సుబ్బారాయుడు తదితరులు రామ్మూర్తి నాయుడి భౌతికకాయానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగ స్వయంగా డప్పు కొట్టి నివాళు లర్పించారు.

# మోదీ నాయకత్వాన.. ప్రగతి పథంలో భారత్

ఉంటారన్నారు. మన బతుకమ్మ, మన సమ్మక్క సారక్క జాతరను ఈ నేలపై జరుపుకొంటారని చెప్పారు. కానీ హైదరాబాద్ పాతబస్తీ నుంచి వచ్చిన కొందరు సమ్మక్క సారక్కను, బతుకమ్మను అపహాస్యం చేస్తున్నారని.. భారతీయ సంస్కృతిని, పండుగలను విమర్శిస్తున్నారని దుయ్యబట్టారు. సనాతన ధర్మాన్ని అగౌరవపరిచేవారికి.. ఆ ధర్మాన్ని అవలంబించేవారు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అన్ని మతాలను సమానంగా చూసే సనాతన ధర్మంపై దాడి జరిగితే చూస్తూ ఊరుకోనని.. కచ్చితంగా బయటకు వచ్చి తన వంతు పోరాటం చేస్తానని ప్రకటించారు. జనసేన ఏర్పాటు వెనుక మహారాష్ట్రకు చెందిన మహానీయుల స్ఫూర్తి ఉందని.. తనకు స్ఫూర్తినిచ్చిన వారిలో ఛత్రపతి శివాజీ, బాలాసాహెబ్ ఠాక్రే ఉన్నారని తెలిపారు. ఆదివారం ఠాక్రే వర్ధంతిని పురస్కరించుకుని ఆయన ఘన నివాళులు అర్పించారు. శివసేన, జనసేన రెండూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం పని చేసేవేనని పవన్ చెప్పారు. తన ఇద్దరు పిల్లలతో మరాఠీలోనే మాట్లాడతానన్నారు. ఈ భాషపై గౌరవంతోనే మరాఠీ నేర్చుకున్నానని అన్నారు. పుణేతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని.. తన ఇద్దరు పిల్లలు ఇక్కడే చదువుకున్నారని చెప్పారు. ఇక్కడ తనకు ఇల్లు కూడా ఉండేదని గుర్తుచేశారు. అయోధ్య రామాలయానికి అవసరమైన కలపను బల్లార్‌పూర్ సమకూర్చడం ఆనందంగా ఉందని తెలిపారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఐదో ఆర్థిక శక్తిగా ఉందని.. దానిని మూడో స్థానానికి తీసుకొచ్చేందుకు మోదీ ప్రభుత్వం కృషిచేస్తోందని చెప్పారు. అభివృద్ధి యాత్రను ఆపడానికి వీల్లేదని.. ప్రతి ఒక్కరూ సరైన అభ్యర్థికి ఓటేయాలని పిలుపిచ్చారు.

# రేవంత్.. ప్రజల్ని ఒప్పించి ప్రక్షాళన చెయ్

మూసీ పరీవాహక ప్రాంతాన్ని ప్రక్షాళన చేసే ముందు అక్కడ ఏళ్లుగా నివసిస్తున్న పేదలను ఒప్పించాలని, వారి అనుమతితో మూసీ సుందరీకరణ ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. పేద ప్రజలకు ఇబ్బంది లేకుండా మూసీ ప్రాజెక్టు చేపడితే బీజేపీ శ్రేణులమందరమూ శ్రమదానం చేస్తామన్నారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లోని బస్తీల్లో సీఎం పాదయాత్ర చేయాలని, తాను కూడా పాదయాత్ర చేస్తానని చెప్పారు. బీజేపీ మూసీ నిద్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి అంబర్‌పేట తులసీరాం నగర్‌లో బస చేసిన కిషన్‌రెడ్డి.. ఆదివారం ఉదయం అక్కడే అల్పాహారం చేసి బస్తీవాసులతో ముచ్చటించారు. ఎన్ని బుల్డోజర్లు వచ్చినా పేద ప్రజల ఇళ్లకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. పేద ప్రజలపైన రాష్ట్ర ప్రభుత్వం యుద్ధం ప్రకటించి ఇళ్లను కూల్చుతోందన్నారు. ఇండ్లు కూల్చుతామని సీఎం రేవంత్ ప్రకటించిన తర్వాత.. భయం, ఆవేదన కారణంగా 9 మంది గుండెపోటుతో మరణించారన్నారు. ఇళ్లను కూల్చడమే ఇందిరమ్మ రాజ్యామా అని నిలదీశారు.



# సంపదపై బీజేపీ కన్ను: భట్టి

ప్రజలపై బీజేపీకి ప్రేమ లేదని, ఇక్కడి అపార ఖనిజ సంపదపైన ఆ పార్టీ కన్నేసిందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖనిజ సంపదను అంబానీ, అదానీలకు అప్పగించేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఝార?ండ్ ఎన్నికల పరిశీలకులుగా ఉన్న భట్టి.. ఆదివారం బోకారో నియోజకవర్గంలో ఇండియా కూటమి తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే తరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర సంపదను, వనరులను కాపాడే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జనాభా నిష్పత్తి ప్రకారం దేశ సంపద, వనరుల పంపిణీ జరగాలని రాహుల్ చెబుతున్నారని, ఇదే నినాదంతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. ఝార?ండ్‌లోనూ ఇండియా కూటమి గెలిస్తే.. ఇక్కడి సంపద ఈ ప్రాంత వాసులకే పంచుతామన్నారు. తెలంగాణ తరహాలో ఏడు గ్యారెంటీలను అమలు చేస్తుందని తెలిపారు.

# 'సవాల్‌లో ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా'

జనగామ జిల్లా: దేవునూర్ అటవీ భూముల కబ్జా ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని కడియం శ్రీహరి సవాల్ విసిరారు. 30 ఏళ్ల రాజకీయ చరిత్రలో తాను ఏనాడు అవినీతికి పాల్పడలేదని, ఒకవేళ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య చేసిన ఆరోపణలపై స్టేషన్‌ఘన్‌పూర్‌లో ధ్వజమెత్తారు కడియం శ్రీహరి. ' దమ్ముంటే రాజయ్య నా సవాల్‌ను స్వీకరించాలి. దళితబంధులో నువ్వు చేసిన అవినీతిని ప్రజాక్షేత్రంలో నిరూపిస్తా. సవాల్‌లో ఓడితే.. నువ్వు రాజకీయాల నుంచి తప్పుకుంటావా రాజయ?. మరోసారి చౌకబారు ఆరోపణలు చేస్తే సహించేది లేదు. అవినీతి అక్రమాలకు పుట్ట కేసీఆర్ కుటుంబం. బీఆర్ఎస్, బీజేపీ విమర్శలను కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలి' అని కడియం శ్రీహరి పేర్కొన్నారు.


# అందుకే బీజేపీ నేతలు భయపడుతున్నారు: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్: గుజరాత్‌కు తెలంగాణ పోటీ వస్తుందని బీజేపీ నేతలు భయపడుతున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధి కాకూడదన్నది బీజేపీ నేతల ఉద్దేశంగా ఉందన్నారు. గుజరాత్ గులామ్‌లా ఎందుకు వ్యవహరిస్తున్నారు. మూసీ సుందరీకరణను ఎందుకు అడ్డుకుంటున్నారు?. క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవాలను పరిశీలించండి" అని మహేష్‌కుమార్ గౌడ్ హితవు పలికారు. మూసీ ప్రాజెక్టు ఆపేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఆపేందుకు కుట్ర చేస్తున్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫోటో షూట్ కోసం మూసీ నిద్ర చేశారు. బస చేసే ముందు ఆ ప్రాంతంలో దోమల, ఈగల మందు కొట్టారు. మూడు నెలలు అక్కడ ఉంటే ప్రజల అవస్థలు తెలుస్తాయి. మూసీ పక్కన మూడు నెలల బస చేయండి అని మా సీఎం సవాల్.. నేను కూడా వస్తాను. మీరు నేను ఇద్దరం కలసి మూడు నెలలు అక్కడ బస చేద్దాం రండి. అక్కడి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. బీఆర్ఎస్ గ్రాఫ్ పడిన ప్రతీ సారి కిషన్‌రెడ్డి బయటకి వస్తాడు. బీఆర్ఎస్‌ను ప్రొటెక్ట్ చేయడానికి కిషన్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నాడు. ఒక్కరోజు నిద్ర చేసి ఏం సాధించారు?. తెలంగాణ అభివృద్ధికి అందుకు అడ్డుపడుతున్నారు. సబర్మతి రివర్ ఫ్రంట్‌కి ఒక న్యాయం.. మూసీ రివర్‌కి ఒక న్యాయమా?. మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇచ్చి ఆదుకుంటాం. వారి పిల్లలకు విద్యావకాశాలు కల్పిస్తున్నాం. గుజరాత్ గులామ్‌లా ఎందుకు వ్యవహరిస్తున్నారు. ప్రపంచంతో తెలంగాణ పోటీ పడుతుందనగానే వీళ్లకు భయం పట్టుకుంది.

# గురుకులాల్లో మృత్యుఘోష

### 11 నెలల్లో 42 మంది విద్యార్థుల మృతి

### మొద్దునిద్ర వీడని సర్కార్: మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్: గురుకులాల్లో విద్యార్థులు వరుసగా ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి. హరీశ్‌రావు ధ్వజమెత్తారు. 11 నెలల కాంగ్రెస్ పాలనలో 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని ఒక ప్రకటనలో ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా బీసీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం కలచివేసిందని అన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థులు అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోతుంటే, వారిని కాపాడాల్సిన ప్రభుత్వం చోద్యం చూడడం శోచనీయమని విమర్శించారు. వాంకిడిలోని గురుకుల పాఠశాల విద్యార్థిని గత 17 రోజులుగా నిమ్స్‌లో వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతున్నదని, బాసరలో ట్రిపుల్ ఐటీ విద్యార్థిని బలవన్మరణానికి కారణం ఎవర ని ప్రశ్నించారు. గత 11 నెల ల్లో సగటున నెలకు ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిన గురుకులాలు, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోజురోజుకు దిగజారిపోతున్నా యని అన్నారు. విద్యార్థుల మరణాలకు ప్రభుత్వం బాధ్యత వహించి, మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురుకులాలు నరకకూపాలుగా మారాయని ధ్వజమెత్తారు. విద్యాశాఖతోపాటు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ, మైనార్టీ శాఖల నిర్వహణలో ముఖ్యమంత్రి నిర్లక్ష్యం అభం శుభం తెలియని విద్యార్థుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. గురుకులాల భోజనంలో నాణ్యత లేకుంటే జైలుకే అని బాలల దినోత్సవం నాడు సీఎం ప్రగల్భాలు పలకడం తప్ప, ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదని విమర్శించారు.

# 'ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై దృష్టి పెట్టాలి'

హైదరాబాద్: నగర పరిధిలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. జీవో 41 ద్వారా అమల్లోకి కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చేందకు రంగం సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. దీనికి సంబంధించి ఈవీ పాలసీ 2026 డిసెంబర్ వరకూ అమల్లో ఉండనుందన్నారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై దృష్టి పెట్టాలని, ఢిల్లీ తరహా కాలుష్య పరిస్థితులు హైదరాబాద్‌కు రాకూడదని ఈ సందర్భంగా పొన్నం పేర్కొన్నారు. తెలంగాణలో రవాణాశాఖ పరంగా మార్పులు చేర్పులు తీసుకొచ్చి ప్రజల్లో చైతన్య తెచ్చే కార్యక్రమాలు చేపడతున్నామన్నారు.

### రెండో రాజధానిగా వరంగల్: మంత్రి కొండా సురేఖ

వరంగల్: దుష్టపాలన అంతమొందించి ఏడాది పాలన సందర్భంగా విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామని మంత్రి కొండా సురేఖ అన్నారు. హన్మకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రులు కొండా సురేఖ, సీతక్క మీడియాతో మాట్లాడారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా లక్ష మంది మహిళలతో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామని కొండా సురేఖ తెలిపారు. వరంగల్‌ను తెలంగాణకు రెండో రాజధాని కోసం అడుగులు పడుతున్నాయని ఆమె తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ అభివృద్ధిపై దృష్టి సారించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది. గతంలో ఇక్కడ నిర్వహించిన రాహుల్ గాంధీ సభ విజయవంతమైంది. ఈ సభ కూడా విజయవంతం చేయాలి" అని కొండా సురేఖ పిలుపునిచ్చారు.

### బీఆర్ఎస్ పార్టీకే ఆ చరిత్ర ఉంది: మంత్రి సీతక్క

బీఆర్ఎస్, బీజేపీకి రాజకీయ లబ్ధి తప్ప వేరే ఆలోచన లేదని.. అందుకే అధికారులపై దాడులు చేస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. మేము మంచి పనులు చేస్తే బీఆర్ఎస్ అడ్డుకుంటోంది. హైడ్రాకు అడ్డుపడుతున్నారు. మీరు చేసిన సకల జనుల సర్వే ఏమైంది?. లిమ్కా బుక్ రికార్డు కోసమే బీఆర్ఎస్ సకల జనుల సర్వే చేసింది. కానీ మేము చేసే కులగణన ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించడానికే. బీఆర్ఎస్ పార్టీకే మూటలు ఇచ్చిన చరిత్ర ఉంది. దేశంలో అత్యధికంగా దోచుకున్న పార్టీ బీఆర్ఎస్. మాకు మూటలు మోసే అలవాటు లేదు. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు పోలీసులను మెచ్చుకున్నారు.. ఇప్పుడు తిడుతున్నారు

# దేశమంత రహదారి!

### దేశంలో అతిపెద్ద రహదారిగా ఎన్‌హెచ్ 44 రికార్డు

### కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సాగుతున్న హైవే

### 3,745 కి.మీ..

### 13 రాష్ట్రాలు.. 30 నగరాల అనుసంధానం

### నేషనల్ హైవే డెవలప్‌మెంట్ కారిడార్‌గా గుర్తింపు




కామారెడ్డి: ఏ కాలంలో అయినా ఒక దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే రహదారులే జీవనాడులుగా ఉపయోగపడుతాయి. రహదారులు ఎంత పక్కాగా, విస్తృతంగా ఉంటే అభివృద్ధి అంత వేగంగా పరుగులు పెడుతుంది. ఆ వాస్తవాన్ని గుర్తించిన మనదేశ పాలకులు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచే రహదారుల నిర్మాణం, విస్తరణపై ప్రత్యేక దృష్టిపెట్టారు. నేడు దేశంలో లక్షల కిలోమీటర్ల జాతీయ, రాష్ట్ర, గ్రామీణ రహదారులు ఉన్నాయి. వాటిని నిత్యం అభివృద్ధి చేస్తూనే ఉన్నారు. మనదేశంలో అతిపెద్ద జాతీయ రహదారిగా ఎన్‌హెచ్ 44 గుర్తింపు పొందింది. ఉత్తర, దక్షిణ భారత దేశాలను అనుసంధానం చేసే దేశంలోనే అత్యంత పొడవైన జాతీయ రహదారి ఎన్‌హెచ్%-%44. ఇది 13 రాష్ట్రాల మీదుగా సాగుతూ 30కిపైగా ప్రధాన నగరాలను కలుపుతూ వెళ్తుంది. ఈ రహదారి పొడవు 3,745 కిలోమీటర్లు. ఉత్తరాన కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ప్రారంభమై హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని బెంగుళూరు నగరం మీదుగా తమిళనాడులోని కన్యాకుమారి వరకు కొనసాగుతుంది. అంటే ఉత్తర భారతం, దక్షిణ భారతం మధ్య రవాణాకు ఇది ఆయుపట్టు లాంటిది. ఈ రహదారిపై నిరంతరం లక్షలాది వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. ప్రధానంగా సరకు రవాణా లారీలు, ట్రక్కులు, వ్యాన్లు వివిధ రాష్ట్రాలకు సరకులను మోసుకెళుతుంటాయి.

### నాటి ఎన్‌హెచ్-7.. నేటి ఎన్‌హెచ్-44

ఈ రహదారి మొదట్లో 7వ నంబర్ జాతీయ రహదారిగా ఉండేది. అయితే నార్త్-సౌత్ కారిడార్‌గా దీనిని గుర్తించి నేషనల్ హైవే డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎన్‌హెచ్‌డీపీ) కింద అభివృద్ధి చేసే క్రమంలో ఎన్‌హెచ్-1ఎ, ఎన్‌హెచ్-1, ఎన్‌హెచ్-2, ఎన్‌హెచ్-3, ఎన్‌హెచ్%-%75, ఎన్‌హెచ్-26, ఎన్‌హెచ్-7 రహదారులన్నింటినీ కలిపి ఎన్‌హెచ్-44 గా మార్చారు. దేశంలోని అన్ని ప్రాంతాలతో కనెక్టివిటీ ఉండటంతో సరకుల రవాణా ఎక్కువగా ఈ రహదారి మీదుగా సాగుతోంది. రాత్రింబవళ్లు భారీ ట్రక్కులు, లారీలు, వాహనాలు తిరుగుతూనే ఉంటాయి.

### రాష్ట్రాల అనుసంధానం

44వ నంబర్ జాతీయ రహదారి పొడవు 3,745 కిలోమీటర్లు. జమ్మూకశ్మీర్‌లో 304 కిలోమీటర్లు, హిమాచల్ ప్రదేశ్‌లో 11, పంజాబ్‌లో 279, హర్యానాలో 257, ఢిల్లీలో 15, ఉత్తరప్రదేశ్‌లో 287, రాజస్థాన్‌లో 28, మధ్యప్రదేశ్‌లో 547, మహారాష్ట్రలో 260, తెలంగాణలో 533, ఆంధ్రప్రదేశ్‌లో 260, కర్ణాటకలో 135, తమిళనాడులో 630 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది.



### శ్రీకృష్ణ నగర్ కాలనీ లో సిసి రోడ్ల నిర్మాణానికి సహకరించిన మంత్రి శ్రీధర్ బాబు, మధుయాష్ కి గౌడ్, డివిజన్ అధ్యక్షులు నరసింహ యాదవ్ కృతజ్ఞతలు తెలిపిన శ్రీకృష్ణ నగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

ఎల్బీనగర్,17నవంబర్ రాష్ట్ర మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీ క్రిష్ణ నగర్ కాలనీ లో సుమారు 24 లక్షలు రూపాయలతో కొత్త సీసీ రోడ్డు నిర్మాణం పనులను చేపట్టారని వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు లు, శ్రీకృష్ణ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కుంట్ల నరసింహ యాదవ్ చెప్పారు. తమ కాలనీలో సిసి రోడ్ల నిర్మాణానికి సహకరించినఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, పిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ కి, వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుట్ల నర్సింహ యాదవ్ గార్ల తోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులకు, జిహెచ్ఎంసి అధికారులకు శ్రీకృష్ణ నగర్ కాలనీ సొసైటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నాగిళ్ల వెంకటేష్ , ట్రెజర్ శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యక్షులు యాదగిరిరావు, అంజయ్య, చంద్ర మోహన్, కృష్ణారెడ్డి, లాల్ సింగ్ లింగయ్య యాదవ్, గణేష్ కాలనీ వాసులు పాల్గొన్నారు.



### వనస్థలిపురం డివిజన్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని రాష్ట్ర మంత్రి దుద్దిల శ్రీధర్ బాబును కలిసిన వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

ఎల్బీనగర్, 17 నవంబర్ వనస్థలిపురం డివిజన్ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని రాష్ట్ర మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబునుకార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి తన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. వివిధ కాలనీలలో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేయాలని మంత్రి శ్రీధర్ బాబును కోరినట్లు కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి చెప్పారు. కాలనీలోని సిసి రోడ్లు, డ్రైనేజీ, అదే విధంగా ఎలక్ట్రిసిటీ, వీటి సమస్యలపై మంత్రి తో వివరించానని, తమ సమస్యలను విన్న మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని వెంకటేశ్వర రెడ్డి వెల్లడించారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతులుగా ఎదగాలి ఆదర్శవంతంగా జీవించాలి

### సామాజికవేత్త బిఆర్ఎస్ జిల్లా నాయకులు డా, ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)

అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవ సందర్భంగా సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు మాత్రమే కాకుండా ప్రవర్తన, నడవడిక, సమాజం పట్ల బాధ్యత ,తల్లిదండ్రుల పట్ల గౌరవం విద్యా బోధించే ఉపాధ్యాయుల పైన గౌరవం తోటి విద్యార్థుల పట్ల స్నేహం సహాయ సహకారాల వంటి గుణాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు బాధ్యతగా చదివితేనే ఉజ్వల భవిష్యత్తు కనిపిస్తుందన్నారు. విద్యార్థి జీవితం విద్యార్థి దశలోనే ప్రారంభం అవుతుందని మంచి" చెడు ద్వారాలు కనిపిస్తాయని ఏ దారిలో వెళ్లాలో విద్యార్థులే నిర్ణయించుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని మరువద్దన్నారు బాధ్యత గల విద్యార్థిగా చదువును గురువులను తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని ర్యాగింగ్ లాంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు విద్యార్థులు విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నంతగా ఎదిగి ఆదర్శవంతంగా జీవించాలన్నారు సామాజికవేత్త, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



### అమెరికాలోని తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ హ్యూస్టన్ పదవ10 వ వార్షికోత్సవ వేడుకలు- టాస్క్-సి.ఓ.ఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి.

కల్వకుర్తి నవంబర్ 17 వార్త మిర్రర్ ప్రతినిధి:-పుట్టిన గడ్డ కల్వకుర్తి నియోజకవర్గానికి అందించిన మరియు అందిస్తున్నస్వచ్ఛంధ సేవా అభివృద్ధి కార్యక్రమాలకు గానుశ్రీ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ హ్యూస్టన్ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించినఅసోసియేషన్ ఈ సందర్భంగాసుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ముందుగా 10 వ వార్షికోత్సవం జరుపుకుంటున్న అసోసియేషన్ బృందానికి ప్రత్యేక అభినందలు తెలుపుతూఇంత అద్భుతంగా స్వాగతం పలికి ప్రతిష్టాత్మకమైన ఎక్సలెన్స్ అవార్డు తనకి అందించినందుకు గాను ముందుగా అసోసియేషన్ కార్యనిర్వాహక వర్గానికి మరియు హ్యూస్టన్ కుటుంబ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అదే విధంగా అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ వాదులుగా మనందరినీ కలుపుతున్న భాష,తెలంగాణ సంస్కృతి,వేడుకలు జరుపుకోవడం ద్వారా తెలంగాణ సంప్రదాయాలు, విలువలు మరియు గొప్ప చరిత్రను తరువాత తరాలకు బాధ్యతగా అందించొచ్చు, మనం విదేశంలో మన తెలంగాణ మూలాలున్న వ్యక్తులందరిని ఏకం చేస్తూ, మన మూలాల గురించి గర్వపడేలా,మన అనుభవాలను పంచుకోవడానికి,ఒకరికొకరు మద్దతివ్వడానికి తెలంగాణవాదులుగా మన గుర్తింపును మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్న అసోసియేషన్ వారిని అభినందించాల్సిన అవసరం ఉంది.భాష,సంస్కృతికే పరిమితం కాకుండా సమాజ సేవలో కూడా తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ హ్యూస్టన్ భాగం కావడం సంతోషించాల్సిన విషయం ఇంత గొప్ప కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న అసోసియేషన్ వారికి ప్రతిఒక్కరికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# సంస్థాగత ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి.

- క్రియాశీల సభ్యత్వం నమోదు
- గ్రామ కమిటీల ఎన్నికలు
- శక్తి కేంద్ర ఇన్చార్జిల బాధ్యతలు




కల్వకుర్తి నవంబర్ 17 వార్త మిర్రర్ ప్రతినిధి:- భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణకు అధిష్టానం అన్ని ఏర్పాటు చేస్తుంది. సాధారణ సభ్యత్వం పూర్తి కాగా క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రక్రియ కొనసాగుతుంది.కల్వకుర్తి మండలం బిజెపి పార్టీ కార్యాలయంలో సంస్థాగత ఎన్నికల కార్యశాల కార్యక్రమన్ని మండల అధ్యక్షులు సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి బిజెపి పార్టీ మండల ఎన్నికల ఇన్చార్జి నిరంజన్ గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలలో బిజెపి పట్ల మంచి ఆదరణ ఉందని అన్నారు.ఎవరైతే 100 కు పైగా సభ్యత్వాలు చేశారో వారు క్రియాశీలక సభ్యత్వం ఆన్లైన్లో తీసుకోవాలని కోరారు. పార్టీ బలోపేతం కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యతను ఇస్తుందని తెలియజేశాడు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి గ్రామం వస్తానని గ్రామాలలో బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించాడు. అదే విధంగా పార్టీ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రన్ని గత 10 సంవత్సరాలు బిఆర్ఎస్ పార్టీ వల్ల ప్రజలందరూ నష్టపోయారు.ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల పేరుతో ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. సంస్థాగత ఎన్నికలలో అధిక స్థానాలు బిజెపి గెలుచుకునేలా కార్యకర్తలు, ఆయా మండల నాయకులు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ నిరంజన్ గౌడ్,సురేందర్ గౌడ్, రామచంద్రారెడ్డి,మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి,బాలరాజ్ గౌడ్, కృష్ణారెడ్డి,నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెడికల్ క్యాంప్ ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్



పీ. ఏ.పల్లి నవంబర్ 17 వార్త మిర్రర్ :పి.ఏ.పల్లి మండల పరిధిలోని వద్దిపట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రివర్ నిమ్స్,సూర్య హాస్పిటల్ (పాల్వాయి వెంకట్ రెడ్డి)నల్గొండ వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత మెడికల్ క్యాంప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై,క్యాంప్ ను పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.అనంతరం ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించారు.ప్రజలకు ఉచితంగా వైద్య శిబిరాన్ని అందించడం అభినందనీయమని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు.ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజల ఇబ్బందులను గుర్తించి, తగిన సేవలు అందించాలని సూచించారు. సమాజ శ్రేయస్సులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు.ప్రజలకు అవసరమైన వైద్యసేవల కోసం తనవంతు తోడ్పాటు అందిస్తున్నామని పేర్కొన్నారు. వైద్యసేవలు అందించడానికి ముందుకురావాలని కోరారు.త్వరలో దేవరకొండలో ఉన్న 100పడకల ఆసుపత్రిని 200 పడకలుగా మార్చబోతున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు ఎల్లయ్య యాదవ్,వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడియ నాయక్,తెర సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నారాయణ,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ నాయక్,యువ నాయకులు సుభాష్ నాయక్ , డాక్టర్ పాల్వాయి వెంకట్ రెడ్డి, రాజేష్, డాక్టర్ రవీందర్ రెడ్డి,ప్రజ్ఞ,రాజేంద్ర, కీర్తీ,యువ తదితరులు పాల్గొన్నారు.



### కల్వకుర్తి రాయల్ ఫంక్షన్ హాల్లో బాల్లోత్సవాల జాతర కార్యక్రమం

కల్వకుర్తి నవంబర్ 17 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి బాలోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన రాయల్ ఫంక్షన్ హాల్ కల్వకుర్తిలో బాలోత్సవాల జాతర నిర్వహిస్తున్నట్లు బాలోత్సవాల కమిటీ కన్వీనర్ చెన్నయ్య గారు తెలియజేశారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగినది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చినటువంటి వారోత్సవాల రాష్ట్ర కమిటీ కార్యదర్శి సోమయ్య రాష్ట్ర నాయకులు వీరాంజనేయులు పాల్గొన్నారు. సృజనాత్మక శక్తి మరియు విద్యార్థులకు మానవీయ విలువలు రూపొందించడం మానసికఉల్లాసం సోదర భావం మానవ విలువలు కాపాడబడుతాయని వారన్నారు. పిల్లల్లో ఉన్నటువంటి నైపుణ్యం ప్రదర్శించడానికి ఇలాంటి వేదికలు చక్కటి అవకాశాన్ని ఇస్తాయని వారు భవిష్యత్తులో ధైర్యంగా ఆయా రంగాల్లో ఎదగటానికి ఉపయోగపడతాయని తెలిపారు. అదేవిధంగా దేశభక్తి పెంపొందుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు ఏపీ మల్లయ్య, లక్ష్మణ మూర్తి , ఖాదపాషా కె. వెంకటేశ్వర్లు మరియు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, చిన్నయ్య విజయకుమార్, ఎల్లయ్య, చంద్రశేఖర్, నరసింహ, ఎల్లయ్య గౌడ్ అంజయ్య వెంకటయ్య తదితరులు తోపాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు కిషోర్ పాల్గొన్నారు.



### గీత కార్మికుడికి గాయాలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 17

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన బొల్లపల్లి రాములు (54) ఆదివారం ఉదయం తాటి చెట్టు ఎక్కుతుండగా కాలుజారి ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. అనంతరం అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వ బాధితున్ని ఆదుకోవాలని అతని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి గీత కార్మికుని పరామర్శించి మెరుగైన వైద్య చికిత్స అందించాలని సూచించారు.



### గ్రూప్ -3 సర్వీసెస్ పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించిన సబ్ కలెక్టర్

మిర్యాలగూడ, నవంబర్ 17:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణ, మండలంలోని పరీక్ష కేంద్రాలను మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ సందర్శించి పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగే విధంగా తగు సూచనలు చేశారు. సబ్ కలెక్టర్ అమిత్ మిర్యాలగూడ పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాల, కేఎల్ఎన్ జూనియర్ కళాశాల, సాకేత (కేఎల్ఎన్ బాలికల) జూనియర్ కళాశాల, సినాప్సి జూనియర్ కళాశాల, మండలంలోని అవంతిపురం శ్రీ ప్రకాష్ రెసిడెన్షియల్ స్కూల్, తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాల, శ్రీనివాస్ నగర్ మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాల, కేశవ్ నగర్ లోని శ్రీచైతన్య స్కూలులోని పరీక్షా కేంద్రాలను సబ్ కలెక్టర్ అమిత్ సందర్శించారు. ఆయన వెంట దామరచర్ల, ఆడవిదేవులపల్లి తహసిల్దార్లు హరిబాబు, జవహర్, సురేష్ లున్నారు.




## అఖిలభారత ఓపెన్ స్కేటింగ్ టోర్నమెంట్లో ఆయుష్ స్కేటింగ్ స్కేటర్లు

దేవరకొండ నవంబర్ 17 వార్త మిర్రర్ అఖిలభారత ఓపెన్ స్కేటింగ్ టోర్నమెంట్లో దేవరకొండ ఆయుష్ స్కేటింగ్ %డ% కరాటే అకాడమీ విద్యార్థులు విజేతలుగా నిలిచారని అకాడమీ కోచ్ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాదులోని యూసుఫ్ గూడా కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో అఖిల భారత ఓపెన్ స్కేటింగ్ టోర్నమెంట్లో అద్భుతమైన ప్రదర్శనతో దేవరకొండకు చెందిన స్కేటర్స్ విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన వారిలో అర్జిత్(జిత్తు) జస్వంత్ యశ్వంత్ జి.రాధారెడ్డి లు విజేతలుగా నిలిచారని కోచ్ చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా నేను మాట్లాడుతూ అకాడమీలో యువ స్కెటర్లు ప్రతిభావంతమైన ప్రదర్శనతో విజేతలుగా నిలిచారని వారి అంకుటిత శ్రమ నిరంతరం శ్రమకు నిదర్శన మే ఈ పోటీలని ఆయన అన్నారు. అదేవిధంగా కరాటే లో కూడా ఉత్తమ ప్రదర్శన ప్రోత్సహిస్తూ దేవరకొండ యువతకు అకాడమీ స్ఫూర్తినిస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన వారికి చైతన్య అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.



### యుజిసి నెట్ లో ....
### టి.ఎస్.సెట్ లో మెరిసిన ఓయూ విద్యార్థి నేత కె.స్వాతి

సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 17.... ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేత, జార్జి రెడ్డి పి.డి.ఎస్.యూ ఓయూ అధ్యక్షురాలు కె.స్వాతి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటి టెస్ట్ ఫర్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ (టి.ఎస్. సెట్ 2024 ) లో సోషియాలజీ సబ్జెట్ లో క్వాలిఫై అయ్యర్,రాష్ట్ర స్థాయిలో తన కేటరిగి లో మొదటి ర్యాంకు సాధించారు. జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటి టెస్ట్ (యుజిసి నెట్) లో కూడా గత సర్కిల్ లో క్వాలిఫై అయ్యారు. ఒక వైపు విద్యా రంగ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ యూనివర్సిటీలు, ప్రభుత్వ విద్యా రంగ బలోపేతం కోసం, విద్యార్థినుల హక్కుల పరిరక్షణ కోసం ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా స్వాతి విద్యార్థి నాయకురాలిగా అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఒక వైపు ఉద్యమాల్లో మరోవైపు అకడమిక్స్ లో అగ్రాగ్రమిగా ఉంటూ జార్జి రెడ్డి లాగ ప్రతిభ కనబరుస్తున్నారు అంటూ అనేక మంది నుండి ప్రశంశలు పొందుతున్నారు. స్వాతి గతంలో ఉస్మానియా యూనివర్సిటీ లో నిర్వహించిన జాతీయ స్థాయి రీసెర్చ్ సెమినార్ లో రీసెర్చ్ పేపర్ ప్రెజెంట్ చేసి, బెస్ట్ పేపర్ అవార్డు కూడా పొందారు. స్వాతి పాఠశాల నుండే విద్య లో చురుకుగా ఉండే వారు. 10 వ తరగతిలో 509 మార్కులతో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బి.ఆర్క్) మరియు ఎం.టెక్ (మాస్టర్స్ ఇన్ అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్ ) కోర్సులను జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ ఎండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జె.ఎన్.ఏ.ఎఫ్.ఏ.యూ) లో పూర్తిచేశారు. ఇపుడు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ విద్యార్థిగా ఉన్నారు. విద్యార్థి నేత కె.స్వాతి మాట్లాడుతూ విద్యాలో, ఉద్యమాలలోనూ అగ్రగామిగా ఉండేలా ప్రోత్సహిస్తున్న తల్లి తండ్రులకు, కుటుంబ సభ్యులకు, యూనివర్సిటీ ప్రొఫెసర్లకు, గురువులకు, విద్యార్థి సంఘాల నాయకులకు, మద్దతుగా నిలుస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్ లో మరింత ఉన్నత శిఖరాలను అందుకోవడానికి తగిన కృషి చేస్తామని తెలిపారు.

## రైతులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు సర్వే ఎలా చేస్తారు - శ్రీరాములు అందెల

### అధికారులు రైతుల పట్ల ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోం - రైతులను ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం బాగుపడలేదు -

వార్త మిర్రర్ ( రంగారెడ్డి జిల్లా ప్రతినిధి.. ధనుంజయ్ నేత ).. నవంబర్ 17 ==



మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం లోని ఫ్యూచర్ సిటీ కొరకు వెయ్యబోతున్నటువంటి 300 ఫీట్ల రోడ్డు కోసం నిన్న బేగరికంచ, మీర్ ఖాన్ పెట గ్రామాల రెవెన్యూ పరిధిలో రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు రైతుల పొలాలలో నుంచి రోడ్డు సర్వే ఎలా చేస్తారంటూ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యాలయంలో శ్రీరాములు మాట్లాడుతూ అధికారులు రైతుల పట్ల ఇష్టానుసారంగా వ్యవహరిస్తే భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని అధికారులను మరియు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులు అడిగిన విధంగా న్యాయం జరిగేంతవరకు అధికారులు ముందడుగు వేయకూడదని, అదేవిధంగా అధికారులు రైతులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి మరియు రైతుల మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరించాలని కోరారు. రైతులు ఏవైతే న్యాయపరమైనటువంటి నష్టపరిహారం కోరుతున్నారో అట్టి విషయాలన్నీ ప్రభుత్వానికి తెలిసేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు తగిన న్యాయం చేయాలని లేనియెడల భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడుతామని తెలిపారు.



## ప్రశాంతంగా కొనసాగుతున్న గ్రూప్ -3 సర్వీసెస్ పరీక్ష పరీక్షకు భారీ సంఖ్యలో గైర్హాజరు

మిర్యాలగూడ నవంబర్ 17:- (వార్త మిర్రర్ ప్రతినిధి) మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ మిర్యాలగూడ పట్టణం, మండలంలో టీజీపిఎస్సి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన గ్రూపు - 3 పరీక్షలకు హాజరు శాతం దారుణంగా పడి పోయింది. ఒకటో పేపర్ కు 39.3 శాతం, రెండో పేపర్ పరీక్షలకు కేవలం 38 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. 28 పరీక్ష కేంద్రాలలో 7,798 మంది అభ్యర్థులు మొదటి పేపర్ పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 3044మంది హాజరయ్యారు, 4,754 మంది గైర్ హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండో పేపర్ కు హాజరు శాతం మరి తగ్గి 2,930 కాగా గైర్హాజరు శాతం 4,868 పెరిగింది. మిన ఇంజనీరింగ్ కాలేజీ పరీక్ష కేంద్రంలో 526 మందికి గాను 213 మంది హాజరు కాగా 313 మంది గైర్హాజరయ్యారు, మహాత్మా జ్యోతిరావు పూలే జూనియర్ కళాశాల శ్రీనివాస్ నగర్ 432 మందికి గాను 148 హాజరు, 284 మంది గైర్హాజరయ్యారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు ప్రశాంతంగా సజావుగా జరిగాయి. అభ్యర్థులను మెటల్ డిటెక్టర్ గుండా లోపలికి అనుమతించి క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష గదులకు పంపారు. డిఎస్పి కె. రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో పోలీసు సీఐలు, ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు.



## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని ఘనంగా సన్మానించిన...బత్తుల విప్లవ్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 17

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో సురమాంబ కంఠ మహేశ్వర స్వామి కళ్యాణం బోనాల మహోత్సవ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీనాయకులు,మాజీ వార్డు సభ్యులు, చౌటుప్పల్ యువ నాయకుడు బత్తుల విప్లవ్ నివాస గృహానికి ఆదివారం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా బత్తుల విప్లవ్ - వాణి దంపతులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి ఘనంగా స్వాగతం పలికి, శాలువాతో సన్మానించి, గోమాత ప్రతిమను బహుకరించారు. అనంతరం బత్తుల విప్లవ్ ఇచ్చిన ఆతిథ్యాన్ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆశీర్వాదంతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, చౌటుప్పల్ మున్సిపాలిటీలో ఘనంగా బోనాల మహోత్సవాన్ని నిర్వహించిన గౌడ కులస్తులను ఈ సందర్భంగా అభినందించారు.



## నిరుపేద కుటుంబానికి సి ఎం ఆర్ ఎఫ్ చెక్కు అందజేసిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు పైళ్ల సోమిరెడ్డి

వార్తా మిర్రర్ మోత్కుర్ నవంబర్ 17... ఇటీవల అనారోగ్య కారణంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయనిధి (సి ఎం ఆర్ ఎఫ్) నిధుల కొరకు అప్లై చేయుట కొరకై కాంగ్రెస్ నాయకులు కారుపోతుల వెంకన్న గౌడ్ ని సంప్రదించగావెంటనే స్పందించి ఆసుపత్రి బిల్లులు సేకరించి స్థానిక లిప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అవిలయ్య మరియు తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామెల్ లి ద్వారా అప్లై చేయగా మంజూరైన చెక్కును ఈ రోజు జిల్లా కాంగ్రెస్ నాయకుడు పైళ్ల సోమిరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారుడు పోల్కం శేషయ్య కి అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో అప్షన్ మెంబర్ గణగాని నర్సయ్య, మండల కాంగ్రెస్ నాయకులు జినుకల కనకయ్య,బద్దం నాగార్జున్ రెడ్డి,మాజీ సర్పంచ్ సుధాగాని పాండు, ఎం డి సమీర్,మాజీ యూత్ కాంగ్రెస్ అద్యక్షుడు మెంట నగేష్, యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు కొనతం నరేందర్ రెడ్డి,బీసు రాహుల్,నరేష్,అశోక్ తదితరులు పాల్గొన్నారు

## గుడిపల్లి చెరువులో చేప పిల్లలను వదిలిన ఎమ్మెల్యే బాలు నాయక్

గుడిపల్లి నవంబర్ 17 వార్త మిర్రర్ :గుడిపల్లి మండల పరిధిలోని పలుగు చెరువులో చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై,మత్స్యకార అధికారులు ప్రజా ప్రతినిధులు,సొసైటీ డైరెక్టర్లతో కలిసి 100% సబ్సిడీతో చేప పిల్లలను పంపిణీ చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.అనంతరం ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించారు.చేప పిల్లలు ఎంత ఉత్పత్తి జరిగితే అంతమేర మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందని, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు.దేవరకొండలో అన్ని మండలాల్లో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో వెలుగులు నింపడమే తమ లక్ష్యమన్నారు. చేపపిల్లల పంపిణీ వల్ల భవిష్యత్‌లో మత్స్యకారుల కుటుంబాల్లో సిరులు కురువాలని ఆకాంక్షించారు.అన్ని మండలాల్లో జిల్లా మత్స్యశాఖ తరుపున చేపల పంపిణీ జరుగుతుందన్నారు. ప్రతీ చెరువుకు మూడు రకాల చేప పిల్లలు ఇస్తున్నామన్నారు.దేవరకొండలో సమృద్ధిగా చెరువులు, కుంటలు పెద్దగా ఉన్నాయని చేపల పెంపకానికి దేవరకొండ ప్రాంతం ఎంతగానో ఉపయోగపడుతుందని, మత్స్యకారులను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతుందని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులో చేపలను పెంచడానికి చేప పిల్లలను ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో పంపిణీ చేస్తున్నదని అన్నారు.చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒక పండుగలా జరుపుతున్నదని, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో అధిక మొత్తంలో చేపలు పెంపకం చేయడానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో చేప పిల్లలను పంపించేసిందని అన్నారు.ఎదుగుతున్న నాయకులను ఏ తరహాలో చూస్తారో అదే తరహాలో చేపలను పెంపకం చేయాలని, పెరిగిన చేపలను అమ్మకం చేసి మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావాలని



కోరారు. గత ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవడంలో విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు ఎల్లయ్య యాదవ్,బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోడీయ నాయక్,వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ రెడ్డి,తెర సత్యనారాయణ రెడ్డి,కాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,చంద్ర రెడ్డి,రామలింగం, శేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి,జగన్ మోహన్ , భూతం సైదులు, దామోదర్ రెడ్డి,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బాలకృష్ణ, ఎప్టీఓ మరయ్యా, డైరెక్టర్ శ్రీనివాస్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ సైదులు,యువ నాయకులు సుభాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో అభివృద్ధి పనులలో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి

ఎల్బీనగర్,17 నవంబర్ రాజకీయాలకు అతీతంగా ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ తెలిపారు.ఎల్బీనగర్ నియోజక వర్గం బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.హరిహరపురం కాలనీలో 46.50 లక్షల రూపాయలతో సి.సి. రోడ్ల శంకుస్థాపన, శ్రీరామ్ నగర్ కాలనీలో 26.00 లక్షల రూపాయలతో సీ.సీ.రోడ్డు ప్రారంభోత్సవం, శ్రీపురం కాలనీ ఫేస్ 2లో 54.20 లక్షల రూపాయలు తో వాకింగ్ ట్రాక్, చైన్ లింక్ ఫెన్సింగ్ తో అభివృద్ధి చేసిన పార్కు ను ప్రారంభించారు . ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిలు మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని ప్రధాన సమస్యలు పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రతి కాలనీలో త్వరలోనే ఒకటొకటిగా ప్రతి అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ బి ఎన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు కటిక రెడ్డి అరవింద్ రెడ్డి, బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొంతం నవ కిషోర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రావు, హరిహర పురం కాలనీ అధ్యక్షులు హనుమంతు రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, సత్య నారాయణ, ముత్యం రావు, శ్రీశైలం, టెంపుల్ చైర్మన్ విజయభాస్కర్, జ్ఞానేశ్వర్ గౌడ్, కొంగర మహేష్ , బిజెపి, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు రఘురాం నేత, బిక్షపతి, రాఘవేంద్రరావు, నీళ్ల రాజు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, శ్రీధర్ రావు, రవి శంకర్, మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి ,కిషోర్, మురళి, విజయ్, సురేష్ కుమార్, కళా



చైతన్య, సాయి శంకర్, ప్రకాష్, సంజీవ, దుర్గాప్రసాద్, వికాస్, బాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే ల ముందే కార్పొరేటర్ లచ్చిరెడ్డి, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి ల మధ్య మాటల యుద్ధం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిల సాక్షి సాక్షిగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ విషయంలో స్థానిక కార్పొరేటర్ లచ్చిరెడ్డి, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటిక రెడ్డి అరవింద్ రెడ్డి లు ఘర్షణ పడ్డారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ విషయంలో ఎన్జీవోస్ కాలనీలో శిలాఫలకం తయారు కానందున ప్రారంభోత్సవం తర్వాత చేద్దామని కార్పొరేటర్ లచ్చిరెడ్డిఎమ్మెల్యేకి తెలిపారు. ఇదే విషయంపై పక్కనే ఉన్న డివిజన్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి తాము స్థానిక నివాసులకు చెప్పామని శిలాఫలకం లేకున్నా అభివృద్ధి పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యేలు కోరారు. మాటల యుద్ధం చోటుచేసుకుని ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. వెంటనే ఎమ్మెల్యే, ఎంపీ లు కలగజేసుకొని సర్ది చెప్పడంతో గొడవ సద్దు మణిగింది.

## మట్టిలో మాణిక్యాలు మన తెలంగాణ రైతులు

తిరుమల శంకర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 17తెలంగాణ రైతులు మరో ఘనత సాధించారు. వరి దిగుబడిలో రికార్డ్ సృష్టించారు. 66.77 లక్షల ఎకరాల్లో ఏకంగా 153 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి పొందారు. యావత్ భారతదేశంలొనే ఇంతటి వరి దిగుబడిని పొంది.. అరుదైన రికార్డ్ నమోదు చేశారు. దీనిపై మంత్రి ఉత్తమ్ హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ రైతులువరి దిగుబడిలో తెలంగాణ రికార్డ్ సృష్టించిందని.. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగుచేస్తే.. 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అయ్యిందని వివరించారు. ఇది తెలంగాణ రైతులు సాధించిన ఘన విజయమని వ్యాఖ్యానించారు.ఏఐసీసీ మహారాష్ట్ర ఎన్నికల పరిశీలకుడిగా నియమితులైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. అక్కడ జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే ఇక్కడి పరిస్థితులను మానిటరింగ్ చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు, ధాన్యం దిగుబడిని తెలుసుకున్న ఆయన.. మహారాష్ట్ర నుండి ప్రకటన విడుదల చేశారు. ధాన్యం దిగుబడి ఘనత ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన మూడు బ్యారేజీలు పనిచేయక పోయినా.. వరి దిగుబడిలో సాధించిన ఈ రికార్డ్ రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుంది. రైతులకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. రాష్ట్ర చరిత్రలోనే కాకుండా యావత్ భారతదేశంలొనే ఇంతటి ధాన్యం దిగుబడి అరుదైన రికార్డ్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ తెలంగాణ ప్రాంతంలో ఇంతటి పంట పండిన సందర్భం లేదు' అని ఉత్తమ్ అభిప్రాయపడ్డారు.ప్రభుత్వంతో మమైకమైన రైతులు.. అంకిత భావంతో చేసిన సాగుతోనే ఈ విజయం సాధ్యపడింది, అందుకు తెలంగాణ రైతులకు అభినందనలు. ఈ ఘనత సాధించడానికి చేయూత అందించిన నీటిపారుదల, వ్యవసాయ శాఖల సిబ్బంది పాత్ర అభినందనీయం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కొనియాడారు.రైతులకు గుడ్ న్యూస్..తెలంగాణ ప్రభుత్వం రైతులకు గుడ్ న్యూస్ చెప్పింది. రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ చేస్తుంది. సన్నరకం వరి ధాన్యం క్వింటాకు రూ.500



చొప్పున జమ చేస్తుంది. ఈ నెల 11న ప్రయోగాత్మకంగా ఓ రైతు ఖాతాలో క్వింటాకు రూ.500 చొప్పున రూ.30 వేలు జమ చేశారు. శనివారం సుమారు రూ.కోటి పైగా బోనస్ చెక్కులపై పౌర సరఫరాల శాఖ సంతకాలు చేసి జారీ చేసింది.రైతులకు తిప్పలు..తెలంగాణ వ్యాప్తంగా 7 వేల 572 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వాటిలో ఇప్పటికే 4 వేలకు పైగా కొనుగోలు కేంద్రాలను కూడా తెరిచినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ చాలాచోట్ల ఇంతవరకు వడ్ల కొనుగోలు ప్రారంభమే కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు వడ్ల కుప్పలు పోసి రోజుల తరబడి ఎదురు చూస్తున్నారు. వడ్ల కుప్పలతో కొనుగోలు కేంద్రాలన్నీ నిండిపోయాయి. స్థలం లేక వడ్లను తీసుకొచ్చిన రైతులు రోడ్లపై రాశులుగా పోస్తున్నారు. అటు రైతులకు, ఇటు వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.

## లంచం తీసుకుంటూ సిబిఐకి చిక్కిన విశాఖ రైల్వే డిఆర్ఎం

విశాఖపట్నం వార్త మిర్రర్ విశాఖ జిల్లా వాల్తేర్ రైల్వే డివిజన్ డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ సీబీఐ అధికారులకు చిక్కాడు. ప్రస్తుతం సెలవులో ఉన్న సౌరభ్ ప్రసాద్ లంచం డబ్బును ముంబైలో తన ఇంటికి వచ్చి ఇవ్వాలని సూచించాడు. దాంతో కాంట్రాక్టర్ ముంబై వెళ్లి రూ.25 లక్షలు లంచం ఇస్తుండగా, సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇదే క్రమంలో ఇటు విశాఖలోని డీఆర్ఎం బంగ్లాలో సీబీఐ శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ సీబీఐ సోదాలు జరిపింది. ఢిల్లీ, విశాఖకు చెందిన రెండు బృందాలు ఈ సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఈ సోదాల్లో పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుంది. లంచం తీసుకుంటూ దొరికిపోయిన డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ను సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన యాదవ సంఘం నాయకులు

వార్త మిర్రర్ మోత్కూర్ నవంబర్ మోత్కూరు మండలం దాచారం గ్రామంలోని శ్రీరాముల నరేష్ యాదవ్ - మౌనిక యాదవ్ దంపతులను యాదవ సామాజిక నాయకులు వివాహానికి హాజ రై ఆశీర్వదించడం జరిగింది .ఈ కార్యక్రమంలో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జక్కుల రామ్ యాదవ్ సంఘం నాయకులు శ్రీరాముల నరేష్ యాదవ్, నవీన్ యాదవ్ , పావిరాల రాంబాబు యాదవ్ ,చల్ల రమేష్ యాదవ్ , శ్రీరాముల యాదయ్య యాదవ్,జక్కుల యాదయ్య యాదవ్ పల్లగొర్ల సత్య నారాయణ యాదవ్ , మార్త కృష్ణయ్యా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





## చిన్నారులను ఆశీర్వదించిన తుంగతుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మందుల సామే ల్

వార్తా మిర్రర్ మోత్కూర్ నవంబర్ 17 మోత్కూరు పట్టణానికి చెందిన బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ కుమార్తెలు బుర్ర పృథ్వీక' తేజశ్రీ ల పట్టు వస్త్రం లంకరణ మోత్కూరు లో జి.ఎం.ఆర్ లో జరిగింది.... ఈ చిన్నారులను తుంగతుర్తి శాసనసభ సభ్యులు మందుల సామేల్ హాజరై ఆశీర్వదించారు.




## భువనగిరి పట్టణ కేంద్రంలో జమాలే బహార్ ఉత్సవంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు జనగం పాండు- డా.ర్యాకల శ్రీనివాస్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో జమాలే బహార్ ఉత్సవాలనులో పాల్గొన్న బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు, బిఆర్ఎస్ టౌన్ పార్టీ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్,మాజీ ఎంపీపీ అధికం లక్ష్మీనారాయణ గౌడ్, భువనగిరి పట్టణ 30 వ వార్డు కౌన్సిలర్ కాజా హాజీముద్దీన్,( బిఆర్ఎస్ మండల నాయకులు ర్యాకల శ్రీనివాస్) బిఆర్ఎస్ మైనార్టీ నాయకులు బబుల్,పండుగ కిరణ్ కుమార్, ఎస్ కే యాకు, ఎస్.కె అహ్మద్, జనగాం మహేష్, మోత్కుపల్లి సైదులు, అశోక్, రాజు,ఎండి రహీం,తదితరులు పాల్గొన్నారు,

# రైడ్ కోసం అధిక చార్జీలు వసూలు చేసిన ఉబెర్ దిమ్మతిరిగే షాక్ ఇచ్చిన వినియోగదారుల కమిషన్

చండీగఢ్‌లోని వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఒక చిన్న రైడ్ కోసం అధిక ఛార్జీలు వసూలు చేసిన ఉబెర్ కస్టమర్‌కు పరిహారం మంజూరు చేసింది. ఆగస్టు 6, 2021న కేవలం 8.83 కిలోమీటర్ల ప్రయాణానికి రూ. 1,334 రైడ్ ఛార్జీ విధించింది. దీంతో బాధితుడు వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించగా అశ్వనీ ప్రషార్‌కు రూ. 10,000తో పాటు చట్టపరమైన ఖర్చుల కోసం అదనంగా రూ. 10,000 ఇప్పించారు. ఇటీవల కాలంలో పెరిగిన టెక్నాలజీ మన అవసరాలను బాగా తీరుస్తుంది. ముఖ్యంగా స్మార్ట్ ఫోన్ వినియోగం పెరగడంతో వివిధ యాప్స్ ద్వారా ప్రజా రవాణా కూడా పెరిగింది. ఊబర్, ఓలా వంటి యాప్స్ ద్వారా మన ఇంటి వద్ద నుంచే గమ్యస్థానానికి వెళ్లే సౌకర్యాలు పెరిగాయి. అయితే ఒక్కోసారి మనం ప్రయాణించిన దూరం కంటే అధికంగా చార్జీలను చెల్లించాల్సి వస్తుంది. చండీగఢ్‌లోని వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఒక చిన్న రైడ్ కోసం అధిక ఛార్జీలు వసూలు చేసిన ఉబెర్ కస్టమర్‌కు పరిహారం మంజూరు చేసింది. ఆగస్టు 6, 2021న కేవలం 8.83 కిలోమీటర్ల ప్రయాణానికి రూ. 1,334 రైడ్ ఛార్జీ విధించింది. దీంతో బాధితుడు వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించగా అశ్వనీ ప్రషార్‌కు రూ. 10,000తో పాటు చట్టపరమైన ఖర్చుల కోసం అదనంగా రూ. 10,000 ఇప్పించారు. ఉబెర్‌పై చర్యల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. అశ్వనీ ప్రషార్ తన రైడ్‌కు సంబంధించిన ముందస్తు ఛార్జీలు రూ. 359 చూపించగా అనంతరం అది రూ.1334 చూపించింది. దీంతో అశ్వనీ ప్రషార్ కస్టమర్ చాట్‌లు, ఈ-మెయిల్‌ల ద్వారా సమస్యను పరిష్కరించడానికి అతను ప్రయత్నించినప్పటికీ అతనికి ఎటువంటి పరిష్కారం లభించలేదు. దీంతో అతడు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. అయితే ఉబెర్ ఇండియా ఛార్జీల పెంపును సమర్థించింది. పర్యటనలో అనేక రూట్ డివియేషన్స్ దీనికి కారణమని పేర్కొంది. ఏది ఏమైనప్పటికీ ముందస్తు ఛార్జీలు వాస్తవ ఛార్జీల మధ్య వ్యత్యాసం అన్యాయమైన వాణిజ్య పద్ధతిని కలిగి ఉందని వినియోగదారుల కమిషన్ పేర్కొంది. దీంతో వినియోగదారుడు మానసిక క్షోభ, వేధింపులకు పరిహారం పొందే అర్హతను గుర్తించి ప్రషార్‌కు అనుకూలమైన తీర్పు ఇచ్చారు. పారదర్శకతను కొనసాగించడంతో పాటు వినియోగదారుల నమ్మకాన్ని




నిలబెట్టడం ఉబెర్ వంటి సర్వీస్ ప్రొవైడర్ల బాధ్యత అని కమిషన్ పేర్కొంది. ప్రషార్‌కు పరిహారం చెల్లించడంతో అతని వ్యాజ్య ఖర్చులను భరించడంతోపాటు ఉబెర్ రూ. 10,000 మొత్తాన్ని వినియోగదారుల సంక్షేమ నిధికి జమ చేయాలని ఇది ఆదేశించింది. అడ్వాన్స్ బుకింగ్ సమయంలో అసలు కాంట్రాక్ట్ ఛార్జీల కంటే అదనపు ఛార్జీలు వసూలు చేయడం అన్యాయమైన వాణిజ్య పద్ధతి, దీనిని తిరస్కరించాలని తీర్పులో పేర్కొంది. బాధితుడి నష్టపరిహారం అందజేయాలని ఆదేశించింది. ఉబెర్, దాని డ్రైవర్ల మధ్య ఒప్పందాల చిక్కుల గురించి వినియోగదారులకు అంతర్దృష్టి లేదని డ్రైవర్ భాగస్వాములతో ఏవైనా రహస్య ఒప్పందాలు ఉన్నప్పటికీ ఉబెర్ కచ్చితంగా జవాబుదారీగా ఉంటుందని వెల్లడించింది. కోర్టు ఆదేశాలకు మేరకు ఇండియా ప్లాట్‌ఫారమ్‌కు సంబంధించిన విశ్వసనీయత గురించి వినియోగదారులకు భరోసా ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తిస్తూ ఉబెర్ క్రెడిట్స్‌లోని ఛార్జీలో కొంత భాగాన్ని గుడ్‌విల్ కింద వాపసు చేసింది.

# ఆ కంపెనీల్లో పెట్టుబడితో మూడేళ్లల్లోనే నమ్మలేని లాభాలు.. టాప్ సెవెన్ కంపెనీలివే

చిన్న పొదుపు పథకాల వైపు స్థిర రాబడి కోసం కొంత మంది పెట్టుబడిదారులు వెళ్తూ ఉంటారు. అయితే మరి కొంతమంది మాత్రం స్టాక్స్‌లో పెట్టుబడికి ముందుకు వస్తున్నారు. రిస్క్ అయినా పర్లేదు అనుకునే వారిక తక్కువ సమయంలో అధిక రాబడికి ఇవి సౌలభ్యంగా ఉంటాయి. ఇటీవల ట్రేడింగ్ సెషన్‌లో తీవ్ర పతనం మధ్య స్మాల్ క్యాప్, మిడాక్యాప్ సూచీలు భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ గేజ్ 5.11 శాతం క్షీణించగా, మిడ్ క్యాప్ ఇండెక్స్ 4.20 శాతం క్షీణించింది. ప్రస్తుత రోజుల్లో డబ్బు సంపాదించడం అనేది ప్రతి ఒక్కరూ చేసే పనే అయినా పెద్ద స్థాయి అవసరాలకు సొమ్ము లేక ఇబ్బంది పడుతున్నారు. అయితే భవిష్యత్ అవసరాలను అర్థం చేసుకుని ఇప్పటి నుంచే పెట్టుబడి మార్గం వైపు పయనించే వాడే అప్పులపాలు కాకుండా ఉంటారని నిపుణుల భావన ఈ నేపథ్యంలో చిన్న పొదుపు పథకాల వైపు స్థిర రాబడి కోసం కొంత మంది పెట్టుబడిదారులు వెళ్తూ ఉంటారు. అయితే మరి కొంతమంది మాత్రం స్టాక్స్‌లో పెట్టుబడికి ముందుకు వస్తున్నారు. రిస్క్ అయినా పర్లేదు అనుకునే వారిక తక్కువ సమయంలో అధిక రాబడికి ఇవి సౌలభ్యంగా ఉంటాయి. ఇటీవల ట్రేడింగ్ సెషన్‌లో తీవ్ర పతనం మధ్య స్మాల్ క్యాప్, మిడాక్యాప్ సూచీలు భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ గేజ్ 5.11 శాతం క్షీణించగా, మిడ్ క్యాప్ ఇండెక్స్ 4.20 శాతం క్షీణించింది. అయితే ఇంత క్షీణతలో కూడా కొన్ని కంపెనీల పెట్టుబడిదారులు మాత్రం ఎలాంటి నష్టం లేకుండా లాభాలను గడిస్తున్నారు. ప్రస్తుతం మూడేళ్ల నుంచి పెట్టుబడిదారులకు మంచి లాభాలను ఇస్తున్న లార్జ్‌క్యాప్ ఈక్విటీ కంపెనీల గురించి ఓ సారి తెలుసుకుందాం.నిప్పాన్ ఇండియా లార్జ్ క్యాప్ ఫండ్ ఎస్అండ్‌పీ బీఎస్ఈ 100 ఇండెక్స్‌లో ఉన్న నిప్పాన్ ఇండియా లార్జ్ క్యాప్ ఫండ్ గత మూడేళ్లలో డైరెక్ట్ ప్లాన్లో 23.09 శాతం, రెగ్యులర్ 22.06 శాతం రాబడిని అందించింది. దీని నిర్వహణలో రోజువారీ ఆస్తులు (ఏయూఎం) రూ. 23,307.26 కోట్లుగా ఉంది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్లూచిప్ ఫండ్‌నిఫ్టీ 100 ఇండెక్స్‌లో ఒక భాగం అయిన ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్లూచిప్ ఫండ్ గత మూడేళ్లలో డైరెక్ట్ ప్లాన్‌లో 20.29 శాతం, రెగ్యులర్లో 19.57 శాతం రాబడిని అందించింది. దీని నిర్వహణలో రోజువారీ ఆస్తులు (ఏయూఎం) రూ. 52,186.35 కోట్లుగా ఉన్నాయి. ఎస్అండ్ పీ బీఎస్ఈ 100 ఇండెక్స్ ఒక భాగం అయిన జేఎం లార్జ్ క్యాప్ ఫండ్ గత మూడేళ్లలో డైరెక్ట్ ప్లాన్‌లో 19.77 శాతం, రెగ్యులర్ ప్లాన్లో 18.74 శాతం రాబడిని అందించింది. దీని నిర్వహణలో రోజువారీ ఆస్తులు (ఏయూఎం) రూ. 108.19 కోట్లుగా



ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ టాప్ 100 ఫండ్‌నిఫ్టీ 100 ఇండెక్స్ ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ టాప్ 100 ఫండ్ గత మూడేళ్లలో డైరెక్ట్ ప్లాన్లో 20.08 శాతం, రెగ్యులర్ 19.37 శాతం రాబడిని అందించింది. దీని నిర్వహణలో రోజువారీ ఆస్తులు (ఏయూఎం) రూ. 31,859.12 కోట్లుగా ఉన్నాయి. బరోడా బీఎన్‌పీ పారిబాస్ లార్డ్ క్యాప్ ఫండ్ నిఫ్టీ 100 ఇండెక్స్ ఒక భాగం అయిన బరోడా బీఎన్‌పీ పారిబాస్ లార్జ్ క్యాప్ ఫండ్ గత మూడేళ్లలో డైరెక్ట్ ప్లాన్లో 18.31 శాతం రాబడిని ఆర్జించింది. రెగ్యులర్‌లో 16.90 శాతం రాబడిని అందించింది. దీని నిర్వహణలో రోజువారీ ఆస్తులు (ఏయూఎం) రూ. 1,823.14 కోట్లుగా ఉన్నాయి. ఇన్వెస్కో ఇండియా లార్డ్ క్యాప్ ఫండ్‌నిఫ్టీ 100 ఇండెక్స్‌లోని ఇన్వెస్కో ఇండియా లార్జ్ క్యాప్ ఫండ్ గత మూడేళ్లలో డైరెక్ట్ ప్లాన్లో 18.12 శాతం, రెగ్యులర్లో 16.44 శాతం రాబడిని అందించింది. దీని నిర్వహణలో రోజువారీ ఆస్తులు (ఏయూఎం) రూ. 955.75 కోట్లుగా ఉంది. ఎడెల్వీస్ లార్జ్ క్యాప్ ఫండ్ నిఫ్టీ 100 ఇండెక్స్ ఒక భాగం అయిన ఎడెల్వీస్ లార్జ్ క్యాప్ ఫండ్ గత మూడేళ్లలో డైరెక్ట్ ప్లాన్లో 17.63 శాతం, రెగ్యులర్లో 15.85 శాతం రాబడిని అందించింది. దీని నిర్వహణలో రోజువారీ ఆస్తులు (ఏయూఎం) రూ.786.62 కోట్లుగా ఉన్నాయి. మరిన్ని బిజినెస్ వార్తల కోసం ఇక్కడ క్లిక్ చేయండి..

# బంగారం ధరలు మరింత పెరుగుతాయా? మార్కెట్ నిపుణులు ఏం చెబుతున్నారు


బంగారం ధరలు ఆకాశన్నంటుతున్నాయి. రోజుకీ రోజుకీ కొత్త ఎత్తులను అందుకుంటున్నాయి. గత కొన్ని నెలలుగా ఒకే తరహాలో పెరుగుతూ వెళ్తున్నాయి. అయితే ఇటీవల ఆల్ టైమ్ గరిష్ట స్థాయి నుంచి కాస్త వెనక్కి తగ్గినట్లు కనిపించాయి. దీని ప్రధాన కారణం యూఎస్(యూనైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో) ద్రవ్యోల్బణం. ఇది మార్కెట్ ను నిరాశలోకి నెట్టింది. అంతేకాక స్టాక్ మార్కెట్ తో పాటు క్రిప్టో కరెన్సీ మార్కెట్ కూడా గత పక్షం రోజులుగా ఇదే ట్రెండ్ ను చవిచూశాయి.బంగారం ధరలు ఆకాశన్నంటుతున్నాయి. రోజుకీ రోజుకీ కొత్త ఎత్తులను అందుకుంటున్నాయి. గత కొన్ని నెలలుగా ఒకే తరహాలో పెరుగుతూ వెళ్తున్నాయి. అయితే ఇటీవల ఆల్ టైమ్ గరిష్ట స్థాయి నుంచి కాస్త వెనక్కి తగ్గినట్లు కనిపించాయి. దీని ప్రధాన కారణం యూఎస్(యూనైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో) ద్రవ్యోల్బణం. ఇది మార్కెట్ ను నిరాశలోకి నెట్టింది. అంతేకాక స్టాక్ మార్కెట్ తో పాటు క్రిప్టో కరెన్సీ మార్కెట్ కూడా గత పక్షం రోజులుగా ఇదే ట్రెండ్ ను చవిచూశాయి. అదే సమయంలో బంగారం రేట్లు కూడా కాస్త తగ్గినట్లు కనిపించాయి. ఈక్రమంలో రానున్న కాలంలో పరిస్థితి ఎలా ఉండబోతోంది. బంగారం, వెండి ధరల్లో మార్పులు ఎలా ఉంటాయి? ఈ విషయాలపై హెచ్‌డీఎఫ్సీ సెక్యూరిటీస్ లో కమోడిటీ అండ్ కరెన్సీ హెడ్ అనూజ్ గుప్తా తన అభిప్రాయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం..బంగారు రేట్లు తగ్గడానికి కారణం..బంగారం ధరలు ఇటీవలి ఆల్ టైమ్ గరిష్ట స్థాయి నుంచి వెనక్కి తగ్గాయి. దీనికి కారణం నిరాశపరిచిన యూఎస్ ద్రవ్యోల్బణం డేటా సమీప-కాల యూఎస్ ఫెడ్ వడ్డీ రేటు తగ్గింపు అంచనాలను నమోదు చేయడమే. ఇంతలో యూరోజోన్, చైనీస్ ఆర్థిక వ్యవస్థలలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ అశాంతి కూడా బంగారం ధరలు తగ్గడానికి కారణమవుతున్నాయి. ఇది కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ సెంట్రల్ బ్యాంకులు బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. ఇది విలువైన పసుపు మెటల్ ధరకు మద్దతునిస్తుంది. పెట్టుబడి దారులకు రిస్క్ ఉంటుందా..గత రెండు వారాల్లో బంగారం ధర 5 శాతానికి పైగా పెరిగింది. కాబట్టి బంగారం పెట్టుబడిదారులు ప్రస్తుత బంగారం, వెండి ధరల్లో 2 శాతం నుంచి 3 శాతం కరెక్షన్ కోసం వేచి ఉండాలి. ఫిబ్రవరి 2024కి సంబంధించిన నిరాశాజనకమైన యూఎస్ ద్రవ్యోల్బణం డేటా యూఎస్ ఫెడ్‌ని కీలక వడ్డీ రేట్లను పెంచడానికి



బలవంతం చేయవచ్చు. ఇది యూఎస్ ట్రెజరీ ఈల్డ్‌లు, యూఎస్ డాలర్ ఇండెక్స్‌లో ర్యాలీని పెంచింది. ఫలితంగా బంగారంపై ప్రతికూలతలు కలుగచేస్తుంది. మరోవైపు బంగారం ధరలు, స్టాక్ మార్కెట్, బిట్‌కాయిన్ ధరలు ఒకే దిశలో కదులుతున్నాయి. దీనికి కారణం ఏంటంటే లిక్విడిటీ, మొమెంటం ఈ మూడు ఆస్తులను కలిపి నడుపుతున్నాయి. బిట్‌కాయిన్ ఈటీఎఫ్‌లకు డిమాండ్ పెరగడం వంటి ప్రత్యేక అంశాలు కూడా బంగారం ధరలు, స్టాక్ మార్కెట్ ట్రెండ్‌లు, బిట్‌కాయిన్ ధరలు ఒకే దిశలో వెళ్లడానికి కారణం.యూఎస్ ఫెడ్ వడ్డీ రేటు సమీప కాలంలో బులియన్ ధరలను నిర్దేశిస్తుందని భావిస్తున్నారు. ఇది కాకుండా, భౌగోళిక రాజకీయ అశాంతి, రాజకీయ అనిశ్చితి మరింత పెరగడం, భవిష్యత్తులో మార్కెట్‌లో బంగారానికి డిమాండ్‌ను పెంచవచ్చు. ఈ క్రమంలో దీర్ఘకాలిక కోణంలో చూస్తే సెప్టెంబర్ 2024 చివరి నాటికి, కామెక్స్ స్పాట్ గోల్డ్ ధర 2,250 డాలర్ల నుంచి 2,300 డాలర్ల పెరగవచ్చు. మన దేశ కరెన్సీ ప్రకారం ఆ ధరలు రూ. 67,000 నుంచి రూ. 67,500 వరకూ పెరిగే అవకాశం. వెండి ధర నేడు ఔన్సుకు 20డాలర్ల నుంచి 27డాలర్ల వరకు విస్తృత స్థాయిలో ఉంది. ముగింపు 27డాలర్ల స్థాయి కంటే ఎక్కువ బ్రేక్‌అవుట్ ఇచ్చిన తర్వాత వెండి ధర బుల్లిష్‌గా మారవచ్చు. మరిన్ని బిజినెస్ వార్తల కోసం ఇక్కడ క్లిక్ చేయండి..

# అతి తక్కువ వడ్డీకే పర్సనల్ లోన్లు.. ఈ బ్యాంకుల్లో ప్రాసెసింగ్ ఫీజు కూడా తక్కువే

ఈ రుణాలు మీ ఊహించని ఖర్చులను కవర్ చేస్తాయి. ఎటువంటి పత్రాలు కూడా అవసరం లేదు. అయితే దీనిలో వడ్డీ మాత్రం మిగిలిన రుణ రకాలతో పోల్చితే అధికంగా ఉంటాయి. ఎందుకంటే వీటిని అసురక్షిత రుణాలుగా బ్యాంకర్లు వర్గీకరిస్తారు. క్రెడిట్ కార్డు రుణాలతో పోల్చితే మాత్రం తక్కువ వడ్డీ రేట్లే ఉంటాయి. వీటిల్లో వడ్డీ రేట్లు అన్ని బ్యాంకుల్లో ఒకలా ఉండవు. అలాగే వ్యక్తులను బట్టి కూడా మారుతుంటాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక వెసులుబాటును కల్పించేవి పరనల్ లోన్లు(వ్యక్తిగత రుణాలు). బయటి వ్యక్తుల వద్ద అప్పులు చేయకుండా బ్యాంకులో ఎటువంటి తనఖా లేకుండా మంజూరయ్యే లోన్లు ఇవి. ఈ రుణాలు మీ ఊహించని ఖర్చులను కవర్ చేస్తాయి. ఎటువంటి పత్రాలు కూడా అవసరం లేదు. అయితే దీనిలో వడ్డీ మాత్రం మిగిలిన రుణ రకాలతో పోల్చితే అధికంగా ఉంటాయి. ఎందుకంటే వీటిని అసురక్షిత రుణాలుగా బ్యాంకర్లు వర్గీకరిస్తారు. క్రెడిట్ కార్డు రుణాలతో పోల్చితే మాత్రం తక్కువ వడ్డీ రేట్లే ఉంటాయి. వీటిల్లో వడ్డీ రేట్లు అన్ని బ్యాంకుల్లో ఒకలా ఉండవు. అలాగే వ్యక్తులను బట్టి కూడా మారుతుంటాయి. రుణ గ్రహీతల వయస్సు, వారి క్రెడిట్ చరిత్ర, నెలవారీ ఆదాయం, ఇప్పటికే ఉన్న రుణాలు, మొత్తం ఆర్థిక పరిస్థితి, యజమాని వర్గం (ఎంఎన్సీ/ ప్రభుత్వం/ రక్షణ, మొదలైనవి)ను బట్టి మారుతుంటుంది. అదే సమంలో మీ క్రెడిట్ స్కోర్ ఎంత ఎక్కువగా ఉంటే, అంత తక్కువకు మీరు రుణాలు పొందుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డేటా ప్రకారం(మార్చి 13,





2024 నాటికి) ఈ పర్సనల్ లోన్లపై హెచ్డీఎఫ్సీ బ్యాంక్ అతి తక్కువ వడ్డీ రేటు 10.50% అందిస్తోంది. మిగిలిన బ్యాంకులలో వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.. హెచ్‌డీఎఫ్సీ బ్యాంక్.. ఈ బ్యాంక్ అత్యల్ప వడ్డీ రేటు అందిస్తోంది. ఏడాదికి 10.50శాతం నుంచి వడ్డీ రేటు ప్రారంభమవుతుంది. 5 సంవత్సరాల కాలవ్యవధిలో రూ. 5 లక్షల రుణ మొత్తానికి ఈఎంఐ రూ. 10,747 నుంచి ప్రారంభమవుతుంది.



# వరల్డ్ డే అఫ్ రెమెంబ్రాన్స్ 2024 సందర్భముగా

విశాఖపట్నం వార్త మిర్రర్ రోడ్డు ప్రమాద బాధితుల కోసం నిర్వహించిన కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., గారు ముఖ్య అతిథిగా హాజరయ్యార ఏ. యూ నార్త్ క్యాంపస్‌లో గల డా.వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియం నందు సందర్భముగా రోడ్డు ప్రమాద బాధితుల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ఆరంభించారు, రోడ్డు ప్రమాద బాధితులు, రోడ్డు ప్రమాదాలలో మరణించిన వారి కుటంబసభ్యులు ఒక్కక్కరుగా సభాముఖముగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలతో వారు కోల్పోయిన బంధాలు, అర్థికముగా మానసికముగా ఎదుర్కున్న సమస్యలను వివరించి ,ట్రాఫిక్ నందు పాటించవలసిన జాగ్రత్తలను నినాదాల రూపంలో ప్లకార్డులతో తెలిజేసారు. రోడ్డు ప్రమాదాలపై పూర్తి అవగాహన కలిగిన నిపుణులు ,పలు ఎన్.జీ.ఓ లు , పలు శాఖల అధికారులు , తమ తమ పరిజ్ఞానాన్ని, సలహాలను అందించారు. కమీషనర్ ఆఫ్ పోలీస్ జిల్లా మేజిస్ట్రేట్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., గారు మాట్లాడుతూ ప్రతీ రోజూ ప్రతీ క్షణం ప్రపంచంలో ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాల వలన ప్రజలు గాయాలకు గురికావడం లేదా మరణించడం జరుగుతుంది, ప్రతీ ఒక్కరూ నాకెందుకులే, మిగిలిన వారు పాటిస్తారు అని కాకుండా తమకు తాముగా రహదారి నిభందనలు పాటించాలని, సెప్టెంబర్ నెల నుండి అందరూ రహదారి నిభందనలు అమలు చేయాలని అదేశించాము, ఆ నెలలో ఘోర రోడ్డు ప్రమాదాలు 32 నుండి 16కి తగ్గుముఖం పట్టాయి, రోడ్డు ప్రమాద మరణాలు 32 నుండి 19 కి తగ్గుముఖం పట్టాయి,నేను జూలై 01 న సిపి గా బాధ్యతలు చేపట్టానని అప్పుడు హెల్మెట్ ధారణ 10 శాతంగా ఉండేదని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లోనే అత్యధికముగా 50 శాతం పైగా ఉందనీ, అది 100 శాతం చేయడం మా లక్ష్యం అని తెలిపారు, రైడర్ తో పాటుగా వెనుక కూర్చునే పిలైన్ రైడర్ కూడా హెల్మెట్ ధరించాలి. త్వరలో నగరంలో మేము కొత్తగా ఏ.ఐ డ్రివన్ ప్రాజెక్టు ప్రారంభించబోతున్నం , ఎవరైనా హెల్మెట్ ధరించక పోయినా ఇతర రహదారి నిబంధనలు పాటించక పోయిన వారి నంబరు ప్లేట్ ను గుర్తించి వారి ఇంటికి నేరుగా ఫైన్ చలానా పంపబోతున్నం, మా ఉద్దేశం ఒక వ్యక్తి కూడా రోడ్డు ప్రమాదం లో మరణించకూడదు, రోడ్డు ప్రమాద బారిన పడకూ నేను చాలా ప్రమాదాలలో గమనించినది ఏమిటంటే కుటుంబం లో ఒక వ్యక్తి మాత్రమే సంపాదిస్తాడు ఆ వ్యక్తి మరణించడం, లేదా సంపాదించే వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై సంపాదన ఆగిపోవడం జరుగుతుంది అటువంటి సమయాలలో సదరు కుటుంభాలు అనాథగా మిగిలి నాశనం అయిపోతున్నాయి, అందుకే రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణం నష్టపరిహారం సకాలంలో అందాలి, చాలా వరకూ పోలీసు స్టేషన్ చుట్టూ ,కోర్టుల చుట్టూ , లాయర్ల చుట్టూ తిరుగుతున్నారు, ఆ పరిస్థితి రాకూడదు. నేను చాలా సందర్భాలలో ఇటువంటి కేసులు చూడడం జరిగినది అందుకు త్వరలో ఎక్కడా లేని విధముగా మన విశాఖ నగరంలో లి ను ప్రారంభించబోతున్నాము. అందులో భాగముగా నగరంలో రోడ్డు ప్రమాద బాధితుల వివరాలు సేకరించి, వారిలో ఎంతమందికి నష్టపరిహారం అందింది, అందనిది నమోదు చేసుకొని , వారికి ఏ విధముగా సహాయం అందించాలి, ఇక ముందు వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఎలా చూడాలి , వారికి సకాలంలో నష్టపరిహారం అందేలా చేయడం కోసం సదరు ప్రత్యేక సెల్, ప్రత్యేక నెంబరుతో ఏర్పాటు చేయడం జరుగుతుంది, అదేవిధముగా నా నెంబరు 7995095799 తో 24/7 ప్రజలకు అందుబాటులో ఉండడం జరుగుతుంది. మనం ఈ రోజు రోడ్డు ప్రమాద బాధితులకు నివాళులు అర్పిస్తున్నాము కానీ నిజమైన నివాళులు ఆయా కుటుంబాలకు సకాలంలో సహాయం అదీ పూర్తిగా జరిగితేనే నిజమైన నివాళులు అర్పించినట్లు. కావునా ఆ వైపుగా మేము పనిచేయడం జరుగుతుంది, అదే మా లక్ష్యం . వచ్చే సంవత్సరం లోపు సదరు బాధితులకు అందాల్సిన సహాయం వారికి అందేలా మాకు సాధ్యమైనంత మేరకు చేయడం జరుగుతుంది. దానికోసం సంబంధిత శాఖల అన్నింటి సహాయం తీసుకుంటాం,మరొక్కసారి రోడ్డు ప్రమాద బాధితులను స్మరిస్తూ రాబోవు కాలంలో నగరంలో ఎక్కడా రోడ్డు ప్రమాదాలు జరగకూడదు, అందరూ స్వతహాగా రహదారి నిభందనలు పాటించాలని, రైడర్ తో పాటుగా వెనుక కూర్చునే పిలైన్ రైడర్ కూడా హెల్మెట్ ధరించాలనీ, బి ఐ ఎస్ గుర్తింపు కలిగిన హెల్మెట్ మాత్రమే వినియోగించాలని, అతి వేగముగా వాహనం నడుపవద్దు, నిబంధనలు పాటిస్తూ , అందరూ రహదారులను వినియోగించుకుంటూ క్షేమముగా ఇళ్లకు చేరాలి. ఈ సందర్భముగా రోటరీ క్లబ్ వారికి కృజ్ఞతలు తెలియజేస్తూ, విశాఖ నగర ట్రాఫిక్ పోలీస్ బాధితులకు, ప్రజలకు అన్ని రకాలుగా సహాయపడుతుందని ఈ సందర్భముగా హామీ ఇస్తుందని తెలిపారు.

# విద్యార్థులు బాధ్యతగా చదివితేనే ఉజ్వల భవిష్యత్తు స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్)అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవ సందర్భంగా రాపర్తి సురేష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు మాత్రమే కాకుండా ప్రవర్తన, నడవడిక, సమాజం పట్ల బాధ్యత ,తల్లిదండ్రుల పట్ల గౌరవం విద్యా బోధించే ఉపాధ్యాయుల పైన గౌరవం తోటి విద్యార్థుల పట్ల స్నేహం సహాయ సహకారాల వంటి గుణాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు బాధ్యతగా చదివితేనే ఉజ్వల భవిష్యత్తు కనిపిస్తుందన్నారు. విద్యార్థి జీవితం విద్యార్థి దశలోనే ప్రారంభం అవుతుందని మంచి" చెడు ద్వారాలు కనిపిస్తాయని ఏ దారిలో వెళ్లాలో విద్యార్థులే నిర్ణయించుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని మరువద్దన్నారు బాధ్యత గల విద్యార్థిగా చదువును గురువులను తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని ర్యాగింగ్ లాంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు విద్యార్థులు విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నంతగా ఎదిగి ఆదర్శవంతంగా జీవించాలన్నారు స్ఫూర్తి విద్యాసంస్థల చైర్మన్, స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్



# బాలియాత్ర' శ్రీముఖలింగం 2024 కార్యక్రమంలో పాల్గొన్న డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు మరియు వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణికుమారి

విశాఖపట్నం వార్త మిర్రర్ ఖారవేల ఎడ్యుకేషనల్,కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పేడాడ.నరసింగరావు శ్రీముఖలింగం గ్రామం జలుమూరు మండలం,శ్రీకాకుళం జిల్లాలో ప్రాచీన కళింగ భారత సంప్రదాయమైన బాలియాత్ర ప్రారంభించడం జరిగింది.ఈ యాత్ర ప్రాచీన కళింగ రాజధాని అయినా శ్రీముఖ లింగేశ్వర స్వామి పుణ్యక్షేత్రంలో వంశధార నది తీరాన జరిగింది.ముఖ లింగేశ్వర స్వామి దర్శనం అనంతరం వంశధార నది తీరాన ఖారవేలు ఘాట్ వద్ద దీపోత్సవం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం ,శ్రీకాకుళం జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి పిరియా విజయ ,ఎమ్మెల్యే కూన రవికుమార్ ,మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ,మాజీ కలింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ , పలువురు కలింగ పెద్దలు,సంఘం నాయకులు,కమిటీ సభ్యులు,తదితరులుపాల్గొన్నారు.